క్లుప్తంగా

బహుజనులు చైతన్యవంతులు కావాలి

కోట: కారంచేడు మారణ హోమం జరిగి 39 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం కోటలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బజారువీధి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు సాగింది. అక్కడ దళిత సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం షాదీ మంజిల్‌లో సమావేశమై బహుజన మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో యునైటెడ్ ఫోరం ఉపాధ్యక్షుడు విజయ్, సువర్ణరాజు, దాసరి సుందరం, మీజూరు మాధవ్, పద్మజ, రంగనాథ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ గోడ నిర్మించాలని వినతి



ఆరోగ్య కేంద్రం

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో రూ.1.50 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మూడు నెలల క్రితం ప్రారంభించారు. దానికి ప్రహరీ గోడ లేకపోవడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్య కేంద్రం వద్దనే జేసీబీలతో పాటు పలు వాహనాలను నిలుపుతున్నారు. ఈ క్రమంలో రోగులు ఆస్పత్రికి వెళ్లాలంటే భయపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అన్నదాన సత్రానికి వాటర్ కూలర్ వితరణ



వాటర్ కూలర్‌ను అందజేస్తున్న వెంకటేశ్వర్లు, స్వర్ణ దంపతులు

రాపూరు: మండలంలోని పెంచలకోన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోని నిత్యాన్నదాన సత్రానికి కలువాయి మండలం మాదన్నగారిపల్లికి చెందిన పోతినేని వెంకటేశ్వర్లు, స్వర్ణ దంపతులు వాటర్ కూలర్ వితరణ చేశారు. వారు బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఏసీ సాగర్‌బాబుకు కూలర్ అందజేశారు. అలాగే శ్రీవారి ప్రసాదాలు నిల్వ చేసుకునేందుకు 30 ట్రేట్లు ఇచ్చారు.

లక్ష్మీనృసింహుడికి ప్రత్యేక పూజలు



యోగనిద్రలో లక్ష్మీనరసింహస్వామి

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనసింహస్వామికి బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తొలి ఏకాదశినాడు శ్రీమన్నారాయణుడు యోగనిద్రకు ఉపక్రమించారని తెలిపారు. ఈ క్రమంలో పాల సముద్రంలో యోగనిద్రలో ఉన్నట్టు స్వామిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించినట్టు చెప్పారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు క్షేత్రోత్సవం చేపట్టారు.

కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో..



హోమం చేస్తున్న వేద పండితులు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న వ్యూహ లక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. టీటీడీ వేద పండితులు నవ కలశ ఆరాధన చేపట్టారు. ఉత్సవమూర్తులకు లక్ష తులసి దళాలతో అర్చన, పంచా హారతులు ఇచ్చారు. అనంతరం హోమం చేశారు. రాత్రి స్వామి, అమ్మవారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.

శాస్త్రోక్తంగా రాజసూయ యాగం



శ్రీకాళహస్తి: పట్టణంలోని చెన్నైరోడ్డులో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాజసూయయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామివారి ఆలయంలో యాగపూజలు చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లను చప్పరంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు.

భృతి భ్రమేనా!



'నేను సీఎం అయిన వెంటనే ఇంటికో ఉద్యోగమిస్తా.. నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు అందిస్తా.. ఎవరూ భయపడొద్దు.. బాబు వస్తే ఇంటికి జాబొస్తాదీ..' ఇదీ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఊరూరా చేసిన ప్రచారం.



టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాల్లో యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగం ఇవ్వకపోతే నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించింది. వీటిపై చంద్రబాబు నాయుడుతో పాటు కూటమి నేతలు జోరుగా ప్రచారం చేశారు. అధికారం దక్కించుకుని నెల రోజులు అయినా దీనిపై ఎవరూ మాట్లాడడం లేదు. కనీసం ఎప్పుడు ఇస్తారో స్పష్టత ఇవ్వలేదు. ఇళ్లలో ఎంతమంది నిరుద్యోగులు ఉన్నారన్న విషయంపైనా సర్వే చేయలేదు. దీంతో యువతీ యువకుల్లో నిరాశ పెరిగిపోతుంది. ఉన్న వలంటీర్లనే తొలగించారని, ఇక ఉద్యోగాలు ఏమి ఇస్తారు అని నిరుద్యోగులు అంటున్నారు. గతంలో మాదిరిగానే చంద్రబాబు ఈ సారి కూడా నిరుద్యోగ భృతి పథకాన్ని అమలు చేయకుండా చివరలో కంటితుడుపుగా చేస్తారా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లేక అంతా భ్రమేనా అని ఆందోళన చెందుతున్నారు.

–చిల్లకూరు/సూళ్లూరుపేట రూరల్/వెంకటగిరి(సైదాపురం)

సూళ్లూరుపేట నియోజకవర్గంలోని తడ, దొరవారి సత్రం, సూళ్లూరుపేట , నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు ఆరు మండలాలు ఉన్నాయి. ఇందులో 64 వేల గృహాలు ఉండగా సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల్లో 27,855 వేల గృహాలు ఉన్నాయి. అలాగే గూడూరు నియోజకవర్గంలో గూడూరు మున్సిపాలిటీతోపాటు గూడూరు మండలం, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 1,01,793 గృహాలు ఉన్నాయి. అదేవిధంగా వెంకటగిరి నియోజకవర్గంలోని వెంకటగిరి మున్సిపాలిటీలో 23 వేలు, వెంకటగిరి రూరల్‌లో 7 వేలు, డక్కిలి మండలంలో 12 వేలు, బాలాయపల్లి మండలంలో 11 వేలు, సైదాపురం మండలంలో 12 వేలు, రాపూరు 11,500, కలువాయి మండలంలో 11 వేలు ఉన్నారు. ఇంటర్ చదివిన వారు ఇంటికి ఒకరు చొప్పున తీసుకున్నా నిరుద్యోగులు సుమారు వేలల్లో ఉన్నారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని, లేదంటే నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలను ఖాతాల్లో జమ చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పాత పరిశ్రమల్లో కొత్త ఉద్యోగాలు ఎలా వస్తాయో?

గూడూరు నియోజకవర్గంలో చిన్న, పెద్ద తరహా పరిశ్రమలు 6 వరకు ఉన్నాయి. అలాగే సూళ్లూరుపేట నియోజవకర్గంలో 165 పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో పెద్దవి 10 ఉన్నాయి. వెంకటగిరి నియోజవకర్గంలోనూ కొన్ని పరిశ్రమలు ఉన్నాయి. అవి ప్రారంభించే సమయంలోనే ఉద్యోగాలను భర్తీ చేశారు. ఎన్నికల సందర్భంగా పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని స్థానిక టీడీపీ ప్రజా ప్రతినిధులు చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వారు కంటి తుడుపు చర్యగా వారం రోజుల క్రితం పరిశ్రమ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని, అది కూడా తాము చెప్పిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలన్న ఆదేశాలు ఇచ్చారు. పరిశ్రమ ప్రతినిధులు మాత్రం ఇప్పటికే ప్రతి క్యాడర్‌లోనూ ఉద్యోగాలు భర్తీ చేసుకున్నామని, పరిశ్రమలు నడుస్తున్న క్రమంలో స్థానికులకు ఉద్యోగాలు ఎలా ఇవ్వాలి అని సందేహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇది నిరుద్యోగులను శాంతింపజేసే ప్రక్రియగా కనిపిస్తోందని వారు అంటున్నారు.

సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఇళ్ల సంఖ్య

ఓజిలి	-	9,579
దొరవారిసత్రం	-	1,142
పెళ్ళకూరు	-	1,673
తడ	-	1,386
నాయుడుపేట రూరల్	-	10,448
నాయుడుపేట అర్బన్	-	12,785
సూళ్లూరుపేట రూరల్	-	11,990
సూళ్లూరుపేట అర్బన్	-	15,050
గూడూరు నియోజకవర్గం..		
గూడూరు మున్సిపాలిటీ	-	30,954
గూడూరు మండలం	-	11,006
చిల్లకూరు మండలం	-	18,456
కోట మండలం	-	17,414
వాకాడు మండలం	-	12,500
చిట్టమూరు మండలం	-	11,463
వెంకటగిరి నియోజకవర్గం..		
వెంటగిరి మున్సిపాలిటీ	-	23,001
వెంకటగిరి రూరల్	-	7,011
డక్కిలి	-	12,005
బాలాయపల్లి	-	11,000
సైదాపురం	-	12,000
రాపూరు	-	11,500
కలువాయి	-	11,000

నేను డిగ్రీ వరకు చదువుకున్నా..



నేను డిగ్రీ వరకు చదువుకున్నా. టీటీసీ కూడా పూర్తి చేశాను. డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నా. మెగా డీఎస్సీ అన్నారు. తారా చూస్తే కొన్ని పోస్టులే ఇచ్చారు. నాకు టీచర్ ఉద్యోగం రాకపోతే నిరుద్యోగ భృతి వస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నా. ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

–శరణ్య ఆవుల, సైదాపురం

ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాం



మాది నిరుపేద కుటుంబం. మా తల్లిదండ్రులు తోపుడు బండిపై అరటి పండ్లు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నారు. నేను బీఏ, బీఈడీ చదివాను. ఉద్యోగం రాకపోవడంతో ఇంటి పట్టునే ఉన్నాను. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. నాకు ఉద్యోగం వస్తే కష్టాలు తీరుతాయని మా కుంటుంబమంతా ఎదురు చూస్తున్నారు.

–హెచ్.లోకేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి, సూళ్లూరుపేట

నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే



నేను డిగ్రీ పూర్తి చేశాను. ఎలాంటి ఉపాధిలేక ఇంటి వద్ద ఉంటున్నాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు విస్మరించారు. ఎన్నికల ముందు రూ.3 వేల నిరుద్యోగ భృతి లేదా ఇంటికో ఉద్యోగం ఇస్తామని గొప్పలు చెప్పారు. ఉద్యోగం వస్తుందని ఎంతో ఆశపడ్డాను. దీనిపై ఇప్పటి వరకు మాట్లాడకపోవడం తగదు. ఉద్యోగం ఇవ్వకపోతే భృతి అయినా ఇవ్వాలి.

– కె.వెంకటేశ్వర్లు, సూళ్లూరుపేట మండలం

ఖాళీగా ఉన్నాము



నేను చదువు పూర్తి చేసి ఖాళీగా ఉన్నాను. ఉద్యోగం కోసం అన్వేషణ చేస్తున్నా. నేడు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రతి ఇంటికీ ఉద్యోగం ఇస్తామని, లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పింది. దీంతో కొంత ఆశ కలిగింది. ఏదైనా ఒకటి అందిస్తే మా కుటుంబానికి కొండంత అండగా ఉంటుంది. త్వరగా సర్వేలు పూర్తి చేసి మా పేర్లు కూడా నమోదు చేసుకుంటే బాగుంటుంది.

–నికేష్, వంజివాక, కోట మండలం

ఇచ్చిన హామీలను నెలవేర్చాలి



నేను బీకాం, ఎంబీఏ పూర్తి చేశాను. చంద్రబాబు, కూటమి నేతలు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు యువత ఆకర్షితులయ్యారు. నిరుద్యోగ భృతిపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. చంద్రబాబు అధికారంలోకి వచ్చి నెల రోజులు అవుతున్నా ఇంత వరకు యువతీ, యువకులకు ఏమీ చేయలేదు. ప్రచారం మాత్రం జోరుగా చేశారు. ఇప్పటికైనా హామీలు అమలుచేయాలి.

– ఎం.కిషోర్, నాయుడుపేట మండలం

సర్వే కూడా చేయలేదు



నేను డిగ్రీ పూర్తి చేశా. గతంలో ఇసుక స్టాక్ పాయింట్ వద్ద పని చేసే వాడిని. దాన్ని నేటి ప్రభుత్వం తీసివేయడంతో పని లేకుండా పోయింది. ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పింది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రకటించి సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే చేస్తే మాలాంటి వారికి నమ్మకం కలుగుతుంది. నిరుద్యోగ భృతి వస్తే కుటుంబానికి కొంత ఆదరవుగా ఉంటుంది.

– నికిత్, ఏరూరు, చిల్లకూరు మండలం

నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నాం.



ఉన్నత చదువులు చదువుకున్నాను. ఉద్యోగం కోసం నిరీక్షిస్తున్నా. ఉద్యోగం రాలేదు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ప్రతి ఇంటికీ ఒక ఉద్యోగం ఇస్తామన్నారు. లేదంటే భృతి ఇస్తామన్నారు. మా ఇంట్లోనే ఇద్దరం ఉన్నాం. ఉద్యోగం లేక ఓ చిన్న దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు నిరుద్యోగ భృతి కోసం ఆశగా ఎదురుచూస్తున్నాం.

–ఎస్ సుధీర్, సైదాపురం

భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగ



పీర్ల చావిడి వద్ద అగ్ని గుండంలో ప్రవేశిస్తున్న యువకులు



ప్రత్యేక పూజలు అందుకుంటున్న పీర్లు

దొరవారిసత్రం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి మొహర్రం సందర్భంగా ముస్లింలు, హిందువులు పీర్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. వేణుంబాకం, కల్లూరు తదితర గ్రామాల్లోని పీర్ల చావిడి వద్ద భారీ ఎత్తున అగ్ని గుండం ఏర్పాటు చేశారు. యువత భక్తిశ్రద్ధలతో నిప్పులు తొక్కుతూ మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా పీర్లకు చక్కెర చదించారు. పాటకచేరి ఏర్పాటు చేశారు. ఎస్ఐ తిరుమలరావు పోలీస్ బందోబస్తు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

నాయుడుపేట టౌన్: నాయుడుపేటలోని గరిడీ వీధిలో ఉన్న హజరత్ మౌలాలీ తలీమ్‌ఖానాలో పీర్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. అనేకమంది పంజాలను తీసుకువచ్చి పీర్ల వద్ద ప్రతిష్ఠించి మొక్కులు చెల్లించారు. అదే విధంగా పట్టణం లోని పీర్ల చావడి వద్ద వద్ద కూడ పలువురు ప్రార్థనలు జరుపుకుని మొహర్రం వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

ముగిసిన పీర్ల పండుగ

చిల్లకూరు: మండలంలోని కడివేడు పీర్ల చావిడిలో పీర్ల పండుగను ముస్లింలు, హిందువులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం రాత్రి అగ్ని గుండం ప్రవేశం చేసిన అనంతరం పీర్లను గ్రామంలో ఊరేగించారు. అనంతరం పీర్లను సమీపంలో ఉన్న చెరువు వద్దకు జల్దికి తరలించారు. దీంతో పీర్ల పండుగ ముగిసిందని ముస్లిం మత పెద్దలు ప్రకటించారు.

గుంతలమయమైన జీఎన్‌టీ రోడ్డు





సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ రోడ్డు సమీపంలో జీఎన్‌టీ రోడ్డుపై ఏర్పడిన గుంతలు, బస్టాండ్ సమీపంలో ఉన్న గుంతలు





కనకదుర్గ థియేటర్ ఎదురుగా ప్రమాదకరంగా ఉన్న గుంతలు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణంలోని జీఎన్‌టీ రోడ్డు గుంతల మయంగా మారి ప్రమాదకరంగా తయారైంది. 15 రోజుల నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షానికి గుంతల్లో నీరు నిలుస్తోంది. దీంతో దిచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు మీద పడిన వర్షపు నీరు ఇరువైపులా ఉన్న కాలువలోకి చేరాల్సి ఉంది. పలువురు రోడ్డును ఆక్రమించుకోవడంతో కాలువ నామరూపాల్లేకుండా పోయింది. దీంతో వర్షపు నీరు పక్కకు వెళ్లే దారిలేక అక్కడే వుండిపోవడంతో వాహనాల దాటికి తారు లేచిపోయి గుంతలు ఏర్పడుతున్నాయి. సూళ్లూరుపేట పట్టణంలోని వినాయకుడి గుడి సెంటర్ నుంచి శ్రీనగర్ కాలనీ వరకు జీఎన్‌టీ రోడ్డు దారుణంగా తయారైంది. ఈ రోడ్డు అర్‌అండ్‌బీ పరిధిలోకి వస్తుందని మున్సిపాలిటీ అధికారులు, తమకేమీ సంబంధం లేదని ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం మానేశారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వం ముందుగా రోడ్ల మీద గుంతలను పూడ్చేందుకు ప్యాచ్ వర్కులు చేయాలని ఆదేశాలిచ్చి చేతులు దులుపుకుంది. సూళ్లూరుపేటకు చెందిన ఆర్‌అండ్‌బీ అధికారులు గాని, మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోకపోయినా కనీసం చర్యలు తీసుకోలేదు. దీంతో వారి వ్యవహారంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతే గాని స్పందించరా అంటూ మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఐఈఆర్టీలను విద్యాశాఖలో విలీనం చేయాలి

చిల్లకూరు: ప్రత్యేక అవసరాలుగల పిల్లల కోసం పనిచేస్తున్న తమను విద్యాశాఖలో విలీనం చేయాలని ఏపీ భవిత స్పెషల్ ఎడ్యుకేటర్స్ పెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మి నాగరాజు కోరారు. ఆయన బుధవారం విజయవాడలో విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగంలో సుమారు 1350 మంది ఐఈఆర్టీలు పనిచేస్తున్నట్టు తెలిపారు. అందరినీ విద్యాశాఖలో విలీనం చేసి ఆదుకోవాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్యలను పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పినట్టు బొమ్మి నాగరాజు తెలిపారు. ఏపీబీఎస్ఈఎఫ్ జనరల్ సెక్రటరీ మాధవ్, జాయింట్ సెక్రటరీ, నీకంఠేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై అవగాహన



డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేసే విధానాన్ని పరిశీలిస్తున్న రైతులు

చిల్లకూరు: వ్యవసాయంలో డ్రోన్లను వినియోగించడం లాభదాయకమని వ్యవసాయ అధికారులు తెలిపారు. వారు బుధవారం తీరప్రాంతంలోని బల్లవోలులో వేరుశనగ పంటపై డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేయడంపై అవగాహన కల్పించారు. డ్రోన్లను ఉపయోగించి ఎకరా పొలంలో పంటకు ఆరు నిమిషాల్లో మందు పిచికారీ చేయవచ్చని వ్యవసాయ సహాయకుడు చెంచుక్రిష్ణయ్య తెలిపారు. పురుగు మందులు పిచికారి చేసేందుకు కూలీలు మొగ్గు చూపించరని, అలాంటి సమయంలో డ్రోన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీని వల్ల సాగు ఖర్చు కూడా 10 శాతం తగ్గుతుందని వివరించారు.

టీచర్స్ లీగ్ క్రికెట్‌పై సన్నాహక సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గూడూరు రూరల్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు డివిజన్‌లో పని చేసే ఉపాధ్యాయులకు టీచర్స్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్టు ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ తెలిపారు. ఆయన బుధవారం ఉపాధ్యాయులతో చైతన్య పాఠశాలలో టీచర్స్ లీగ్ క్రికెట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో 18 మండలాలకు చెందిన ఉపాధ్యాయుల జట్లు పాల్గొంటాయన్నారు. త్వరలోనే తేదీలను ప్రకటిస్తామని, పోటీల్లో పాల్గొనే వారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, మునిభాస్కర్, మురళీసింగ్, బాబర్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



కోవూరుపాడులో బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

వరదయ్యపాళ్యం: తాళం వేసి, ఉన్న ఇంట్లో దుండగలు చొరబడి చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని కోవూరుపాడు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎస్.ప్రభావతి శ్రీ సిటిలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తుంది. విధి నిర్వహణలో భాగంగా మంగళవారం యథావిధిగా మధ్యాహ్నం షిఫ్టుకు కంపెనీకి వెళ్లింది. ఇంటి వద్ద ఆమె తల్లి ఉండగా సాయంత్రం 4 గంటల సమయంలో ఆమె ఇంటికి తాళం వేసుకుని అక్కడికి సమీపంలోని మరో ఇంటి వద్దకు వెళ్లింది. ఆమె అర్ధగంట తరువాత తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళం తెరిచి ఉండడాన్ని గమనించి లోనికి వెళ్లి, పరిశీలించింది. అయితే ఆమె కుమార్తె రాత్రి 11 గంటల సమయంలో కంపెనీ నుంచి ఇంటికి రాగానే బెరువా తెరిచి చూడగా అందులో ఉన్న 6 సవర్ల బంగారు నగలు 200 గ్రాములు వెండి, రూ.15 వేలు నగదు దోచుకెళ్లినట్టు గుర్తించారు. బాధిత మహిళ వెంటనే బుధవారం ఉదయం వరదయ్యపాళ్యం పోలీసులకు సమాచారం అందించింది. దీంతో ఎస్ఐ ప్రతాప్, ఏఎస్ఐ షణ్ముగం సంఘటనా స్థలానికి చేసుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి కల్చరల్: ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కారించాలని ఏపీ ప్రగతి శీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ తెలిపారు. ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో బుధవారం ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని లోకేష్ చెప్పారని, దాన్ని నెరవేర్చాలన్నారు.